క్లుప్తంగా

చదువు ద్వారానే సమాజాభివృద్ధి

తెలకపల్లి: చదువు ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని మిషన్ ఎడ్యుకేషన్ ఫౌండర్, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు అన్నారు. సోమవారం కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, ప్రేరణ తరగతుల ముగింపు కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సౌకర్యాలను సద్వినియోగంచేసుకుని విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కల్లుగీత సహకార సంఘం ఎన్నిక

చారకొండ: మండలంలోని జూపల్లిలో సోమవారం కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలను ఎన్నికల అధికారి, ఎక్సైజ్ సీఐ మహబూబ్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా సత్తూరి దశరథంగౌడ్, ఉపాధ్యక్షుడిగా అక్కి హుస్సేన్, కార్యదర్శిగా వెంకటయ్యగౌడ్, డైరెక్టర్లు కాసాని దశరథం గౌడ్, పల్ప ఎల్లయ్య గౌడ్, మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి నియామకపత్రాలను ఎన్నికల అధికారి అందజేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

మన్ననూర్: గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులను చేపడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని పదర, అమ్రాబాద్, మన్ననూర్‌లో పర్యటించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, డ్రెయినేజీలను పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త తొలగించాలని తెలిపారు. వారంలో ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. వారి వెంట సర్పంచ్ నేనావత్ శ్రీరాం, ఎంపీఓ వెంకటయ్య, కార్యదర్శి భీముడు ఉన్నారు.

ఆశావర్కర్లకు పరీక్షలను రద్దు చేయండి

పెంట్లవెల్లి: ఆశావర్కర్లకు పరీక్షలను రద్దు చేయాలని జూనియర్ డాక్టర్ ప్రియకు సీఐటీయూ నాయకులు సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వినతిపత్రం ఇచ్చారు. 32ఏళ్ల నుంచి ఆశావర్కర్లుపనిచేస్తున్నారని అప్పటి నుంచి లేనిది ఇప్పుడు కొత్తగా పరీక్ష పెట్టడం సరికాదన్నారు. కరోనా కాలంలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, మమత, వెంకటమ్మ, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంటగది నిర్మాణానికి భూమిపూజ

తాడూరు: మండలంలోని పాపగల్‌లో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో వంటగది నిర్మాణానికి సర్పంచ్ సువర్ణ సోమవారం భూమిపూజ నిర్వహించారు. పాఠశాలలో ప్రహరీ వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, రవీందర్, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లి సింగిల్ విండో కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 30కేజీల బస్తా రూ.843 ఉంటుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

కల్వకుర్తిరూరల్: ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇది సరికాదని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సురేష్ గౌడ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. తాలు, తరుగు, తేమ, హమాలీ పేరుతో ధాన్యాన్ని సమయానికి అన్‌లోడ్ చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎస్‌ఐగా శేఖర్‌రెడ్డి

కోడేరు: మండల ఎస్‌ఐగా శేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ రాజు కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్ 2వ ఎస్‌ఐగా బదిలీపై వెళ్లారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం



కల్వకుర్తి: అకాల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. ఆదివారం సాయంత్రం, సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న, వేరుశనగ పంటలు తడిసిపోయాయి. తడిసిన మొక్కజొన్న, వేరుశనగను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

గుంతలమయంగా రహదారులు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని బీటీ రోడ్లు

చారకొండ: మండలంలోని గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకర తేలి గుంతలమయంగా మారాయి. చంద్రాయన్‌పల్లి, గోకారం, సారంబండతండా, నూకల చింతవాడిక, బొమ్మలగుడిసెలు, నెమలిగుట్టతండా, ఇతర తండాలకు మట్టి రోడ్లే దిక్కయ్యాయి. చంద్రయాన్‌పల్లి, గోకారం, రాంపురం గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మట్టి రోడ్లు కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారి, నడవలేని పరిస్థితి నెలకొంటుంది.

కంకర దశలోనే రోడ్లు..

కొన్ని చోట్ల మట్టి రోడ్లను బీటీగా మార్చేందుకు కంకరపరిచి వదిలేశారు. తిరిగి వాటిని పట్టించుకున్న నాథుడే లేడు. కంకర రోడ్లపై ద్విచక్రవాహనాలు ప్రమాదాలు గురవుతున్నారు. పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు కంకర పరిచి ఏళ్లు గడుస్తుంది.



చంద్రాయన్‌పల్లిలో కంకర తేలిన రోడ్డు

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని నెమలిగుట్టతండాకు జూపల్లి నుంచి నెమలిగుట్టతండా వరకు రూ.2.70 కోట్లు బీటీ రోడ్డు నిధులు మంజూరు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఐదు నెలలు పూర్తయినా అక్కడ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. మంజూరైనా పనులైనా త్వరగా పూర్తి చేయాలని తండా వాసులు కోరుతున్నారు. చారకొండ నుంచి వెల్దండ వరకు ఉన్న రోడ్డు రాంపురం, గోకారం, చంద్రాయన్‌పల్లి, ఎర్రవల్లి, వెల్దండ కలుపుతూ ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. బీటీగా మార్చాలని కోరడంతో, తాత్కాలికంగా మట్టి వేసి చేతులు దులుపుకున్నారు.



గుంతలమయమైన జూపల్లి నుంచి వంగూరు రోడ్డు

కంకర వేసి వదిలేశారు



మట్టి రోడ్లపై బీటీగా మార్చేందుకు కంకర మాత్రమే వదిలేశారు. కంకర రోడ్లపై ప్రయణించడానికి ఇబ్బందులు పడుతున్నాం. చిన్న వర్షం పడితే చాలు గుంతలుగా ఉన్నా రోడ్డు బురదమయంగా మారుతుంది. పలుమార్లు ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పినా స్పందించడం లేదు.

– వెంకటయ్య, జూపల్లి

ప్రతిపాదనలు అధికారులకు పంపించాం..

మండలంలోని గోకారం, చంద్రాయన్‌పల్లి, బొమ్మలగుడిసెలు, పలు తండాల మట్టి రోడ్లను బీటీలుగా మార్చేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇంకా మంజూరు కాలేదు.

– మౌనిక, పంచాయతీరాజ్ ఏఈ

బీటీ లేక అవస్థలు



మా గ్రామం నుంచి ఎటు వెళ్లాలన్న మట్టి రోడ్డే దిక్కయ్యింది. అత్యవసర సమయంలో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలంటే, రవాణా సౌకర్యం ఎంతో ముఖ్యం. గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

– నిరంజన్, చంద్రాయన్‌పల్లి

పనులు ప్రారంభించలేదు



నెమల్లిగుట్టతండా నుంచి జూపల్లికి బీటీ రోడ్డు మంజూరు అయిందంటే ఆనందపడ్డాం. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వచ్చి తండాలో శిలాఫలకం వేసి పనులు ప్రారంభించారు. ఐదు నెలలైనా పనులు ప్రారంభం కాలేదు. అధికారులు, కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి బీటీ రోడ్డును పూర్తి చేయాలి

– చంద్రునాయక్, నెమల్లిగుట్టతండా

వాహనం ఢీకొని కోడెదూడ మృతి

తెలకపల్లి: వాహనం ఢీకొని కోడెదూడ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నముద్దునూరు చెందిన వెంకటయ్య పశువులను తీసుకుని పొలం నుంచి వస్తుండగా సోమవారం సాయంత్రం తెలకపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న వాహనం కోడెదూడను ఢీకొంది. ఈ ప్రమాదంలో కోడెదూడ అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వాహనం బోల్తా పడి డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. మృతి చెందిన కోడె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

రహదారి పనుల పరిశీలన

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ గేట్ ఎదుట ప్రధాన రహదారి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. ఆమె వెంట ఏఈ విద్యాసాగర్‌రెడ్డి, కౌన్సిలర్ కృష్ణమూర్తి పలువురు ఉన్నారు.

సీఐకి సన్మానం

కల్వకుర్తిరూరల్: శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సీఐగా బాధ్యతలు స్వీకరించిన పార్థసారథిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, సంతుయాదవ్, నర్సిరెడ్డి, కృష్ణగౌడ్, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పేరుతో మరోసారి మోసం

మన్ననూర్: ఉమామహేశ్వర, చెన్నకేశవ రిజర్వాయర్ పేరుతో నియోజకవర్గ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ఈ ప్రాంత అధికార పార్టీ నాయకులు ప్రజల ముందుకు వస్తున్నారని ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు రామావత్ సంతోష్ నాయక్ ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2018లో అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి, ఇప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావ్ అమ్రాబాద్ సభలో రిజర్వాయర్ హామీ ఇచ్చి ఇప్పటికి నాలుగున్నర ఏళ్లు అవుతుందన్నారు. అప్పట్లో అది నమ్మిన ప్రజలు ఓట్లు వేసి గెలిపించి అధికారం కట్టబెడితే ఇప్పటి వరకు ఆ ఊసే లేదని విమర్శించారు. మరో 6 నెలలు ఎన్నికలు ఉన్నందున మళ్లీ రిజర్వాయర్ పేరుతో మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నారనేది అందరూ గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో లడ్డు యాదవ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సారా అమ్మితే కఠిన చర్యలు

అచ్చంపేట రూరల్: సారా అమ్మినా, తయారు చేసిన కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్‌ఐ బాలరాజు హెచ్చరించారు. సోమవారం మండలంలోని పల్కపల్లిలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఉప్పునుంతల మండలం దేవదారికుంటకు చెందిన శాలి 20లీటర్ల సారా స్కూటీపై తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. ఆమెను అరెస్టు చేసి స్కూటీ, సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

భక్తిభావంతోనే మనస్సుకు ప్రశాంతత



దారారంలో ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ట

లింగాల: ప్రతి మనిషిలో భక్తిభావం ఉన్నప్పుడే మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని దారారంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. గ్రామాలలో భక్తిభావం వెల్లివిరుస్తుందని, ప్రతి మనిషిలో దైవ చింతన ఎంతో అవసరమని అన్నారు. ప్రతి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం ఉండాలనేది ఒక సాంప్రదాయంగా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచు కవిత, ఎంపీటీసీ తిర్పతయ్య, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటగిరి, తిర్పతయ్య, అశోక్‌రెడ్డి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పలు విగ్రహాల ప్రతిష్ట..

ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు, సీతారాములు, శివసార్వతులు, నంది, గణేష్ విగ్రహాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ నడుమ భక్తి శ్రద్ధలతో ప్రతిష్టించారు. దాదాపుగా 30 టన్నులు ఉన్న ఏకశిల రాతి ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. మహిళలు ధ్వజస్తంభాన్ని కలశ జలంతో శుద్ధి చేశారు. వల్లభాపూర్‌లో చెన్నకేశవ ఆలయంలో చెన్నకేశవ విగ్రహ ప్రతిష్టతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు.

కొత్రలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ట..

వెల్దండ: మండలంలోని కొత్రలో సోమవారం బొడ్రాయి, విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్, లచ్చనాయక్‌తండా, రాంనాయక్‌తండా, చెంచుగూడెంలో బొడ్రాయి పండుగను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలకు బొడ్రాయి పండుగ నిర్వచనం అన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు..

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో బీరప్ప ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో సోమవారం బండారు వేసుకుని భక్తిశ్రద్ధలతో బీరప్ప స్వామికి పూజలు చేశారు. అనంతరం బీరప్ప ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేపట్టారు.



పసుపు చల్లుకుంటున్న మహిళలు



కలశ జలంతో శుద్ధి చేసేందుకు తరలివచ్చిన మహిళలు

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతల సహకారంతోనే నిర్వహణ చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ తెలిపారు. సోమవారం ఉప్పునుంతల మండలం సదగోడు సర్పంచ్ మల్లారెడ్డి, మమత దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యాన్నదానం కోసం రూ.30,116 చైర్మన్‌కు అందజేశారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం

వెల్దండ: మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో ఎంపికైన విద్యార్థులకు సోమవారం ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ శాంతి, ఉప సర్పంచ్ అలీ రూ.20వేలు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మండల స్థాయి రాణించి జిల్లా స్థాయి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, గోపాల్ నాయక్, పీఈటీ రవీందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నల్లమల వాసికి డాక్టరేట్



రాజేశ్వర్‌రెడ్డి

అచ్చంపేట: నల్లమల ప్రాంతంలోని బల్మూర్ మండలం ఇప్పకుంటకు చెందిన రాజేశ్వర్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నాడు. యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ డాక్టర్ నాచగోని నర్సింహులు ఆధ్వర్యంలో పాలిమర్ నానో సమ్మేళనాలను ఉపయోగించి 'అతినీల లోహిత వికిరణ ప్రభావాన్ని తగ్గించడం' అంశంపై పరిశోధన సమర్పించాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఫిజిక్స్ విభాగం నుంచి డాక్టరేట్‌ను ప్రకటించినట్లు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈయన ప్రస్తుతం మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు కళాశాలలో ఐఐటీ, నీట్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

కలెక్టరేట్ ముట్టడించిన వీఓఏలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీఓఏలు

నాగర్‌కర్నూల్‌రూరల్: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వీఓఏల సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల ఆందోళనకు గురవుతున్నామని అన్నారు. కేవలం రూ.3,900 గౌరవవేతనం తీసుకుని కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని విచారం వ్యక్తం చేశారు. వీఓఏలకు కొత్త సర్వేలు చూపిస్తూ పనిభారం పెంచుతూ గ్రామ స్థాయిలో అతితక్కువ వేతనంతో పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికైనా రూ.26 వేల వేతనం ఇవ్వడంతో పాటు రూ.10 లక్షల సాధారణ బీమా, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్‌చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఓఏలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్ట్..

తెలకపల్లి: సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు సీఐటీయూ నాయకులను, వీఓఏలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు పోలీస్‌స్టేషన్‌లోనే నిరసన వ్యక్తం చేశారు. గోపాస్ లక్ష్మణ్ మాట్లాడుతూ వీఓఏల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న వారిని అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్టయిన వారిలో విజయ్‌గౌడ్, ఉస్సేన్, మహేష్, రామకృష్ణ, శ్రీశైలం, పరశురాములు తదితరులు ఉన్నారు.

నోముల జంగయ్య వర్ధంతి సభ

ఉప్పునుంతల: మండలంలోని రాయిచేడ్‌లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ నోముల జంగయ్య 2వ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన స్థూపం వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. జంగయ్యకు ఊహ తెలిసినప్పటి నుంచి చనిపోయే వరకు పార్టీ జెండాను మోస్తూ ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారని ఆయన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో దేశ్యానాయక్, మల్లేష్, చంద్రయ్య, చిన్న అంజనయ్య, సందగోపాల్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న సభ్యులు

నాగర్‌కర్నూల్‌రూరల్: భాగ్యరెడ్డివర్మ జయంతిని అంబేద్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నిజాం రాజ్యంలో ఆదిహిందూ మూల భారతీయుల జన్మించిన తొలి సూర్యుడు మాదరి భాగ్యరెడ్డివర్మ అని తెలిపారు. సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలకు, బాల్యవివాహాలకు, దేవదాసి, జోగిని వంటి ఎన్నో సమస్యల పరిష్కారానికి పోరాడిన తొలినాయకుడు అని అంబేద్కర్ ఐడియాలజి మిషన్ అధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. కార్యక్రమంలో రాములన్న, శోభన్, కోటి, చంద్రయ్య, బాలరాజు, నాగయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పాత బకాయిలు చెల్లించండి

కోడేరు: పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీ డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ చేసిన పనికి డబ్బులు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన లాభం లేకుండా పోయిందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు అందించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కూలీలు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధ్యాపకులు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆడి, పాడారు. ప్రిన్సిపాల్ మల్లేశం, పాలమూరు యూనివర్సిటీ కోఆర్డినేటర్ రామరాజు యాదవ్ మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని మంచి స్థానంలో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. ఉన్నత స్థాయి ఎదిగితే వారి తల్లిదండ్రులతో పాటు, కళాశాలకు కూడా మంచి పేరు వస్తుందన్నారు. అధ్యాపకులు ఉదయ్‌కుమార్, కురుమయ్య, రమేష్‌కుమార్, సోఫి, శివుడు, స్వామిసాగర్, జగన్నాథం, వసుంధర, కవిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం కురిసిన వర్షాలకు విద్యుత్ వైర్లు, స్తంభాలు పడి మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. మండలంలోని తిమ్మినోనిపల్లికి చెందిన జంగమ్మకు చెందిన పాడి గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. బొల్లంపల్లికి చెందిన రైతు అంజయ్య పొలంలో విద్యుత్ స్తంభంతో పాటు వైర్లు కాడెద్దుపై పడడంతో మృతి చెందింది. గాన్‌గట్టుతండాకు చెందిన పాత్లావత్ చంద్రునాయక్‌కు చెందిన మూడు మేకలు విద్యుత్ వైర్లకు తగిలి మృతి చెందాయి. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారు జామున ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షాలకు మూగజీవాలు మృత్యువాత పడినట్లు బాధిత రైతులు వాపోయారు. గేదె విలువ రూ.60వేలు, కాడెద్దు విలువ రూ.50వేలు, మేకల విలువ రూ.45వేలు ఉంటుందని రైతులు పేర్కొన్నారు. పశువైద్య అధికారులు పరిశీలించి పంచనామా చేశారు.

అందని ఆన్‌లైన్ సేవలు

- పంచాయతీల్లో ప్రారంభం కాని ఆన్‌లైన్ సేవలు

ఊర్కొండ: పంచాయతీల ద్వారా పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ–పంచాయతీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి ద్వారా జనన, మరణ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలు, వచ్చే ఆదాయం, ఇంటి నిర్మాణ అనుమతులు, పన్నులు, ఇతర వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు కార్యదర్శులకు సైతం సులభమవుతుంది. ప్రస్తుతం పంచాయతీకి సంబంధించిన ప్రతి సమాచారాన్ని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్ చేసుకునే పరిస్థితి ఉంది.

16 పంచాయతీల్లో ..

మండలంలో ప్రస్తుతం 16 పంచాయతీలకు 2016లో ప్రభుత్వం ఈ–పాలనకు సంబంధించిన కంప్యూటర్లు పంపిణీ చేసింది. గతంలో అనేక సార్లు పంచాయతీలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నాలు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మండలంలోని ఏ ఒక్క పంచాయతీలో ఇంటర్ నెట్ సేవలు ప్రారంభం కాలేదు. ప్రతి పంచాయతీలో టీ–ఫైబర్‌కు సంబంధించిన సోలార్ ఇన్వర్టర్‌తో కూడిన సెటప్‌ను ఏర్పాటు చేసి వదిలేశారు. అలాగే కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి.



ఊర్కొండలో నిరుపయోగంగా ఉన్న ఇన్వర్టర్, ఇతర పరికరాలు

ఉపయోగంలోకి తెస్తాం..



మండలంలోని పంచాయతీలకు కంప్యూటర్లు వచ్చిన మాట వాస్తవమే. గతంలో అదే గ్రామంలో ఎవరైనా ఆపరేటర్లు ఉంటే పనిలో పెట్టుకోవాలని చెప్పారు. అది ఇంకా అమలు కాలేదు. గ్రామాల్లో ఫైబర్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. పని పూర్తయిన వెంటనే ఉపయోగంలోకి తెస్తాం. ప్రస్తుతం మండల కేంద్రం నుంచే ఈ– పంచాయతీ సేవలు అందిస్తున్నాం. టీ–ఫైబర్ ఇంటర్‌నెట్ అందుబాటులోకి వస్తే పంచాయతీల్లో సేవలు అందుబాటులోకి వస్తాయి.

– ప్రభాకర్, ఎంపీడీఓ